
# ఆరోహణ అవరోహణ

## కృష్ణారావు



'ఆ ప్రాంతంలో ఉన్న అయిదారు గ్రామాలవారికీ శుభానికి గానీ అశుభానికి గాని అవధాన్ని ఆశ్రయించక తప్పేది కాదు. అవధాన్నీ — అతని యింటినీ అందరూ బాగా ఎరుగుదురు. క్రొత్తవాళ్లు ఎవరైనా "అవధానిగారి యిల్లెక్కడ?" అంటే — ఆ కోవిలి వీధినుంచీ వెళ్తుంటే మధ్యలో దక్షిణ ప్రక్క సందులోంచి నాలుగు బారలు వెళ్లి కుడి పక్కకి తిరిగితే కనిపిస్తుంది ఎత్తరుగులుతో ఉన్న ఆ చివారయిల్లే — అంటారు.

అవధానేం చదువుకున్నాడో ఎవరికీ తెలియదు. కాని మంచి మాటకారి. చిన్నప్పుడే కష్టపడి యింతవేదం చెప్పించుకున్నాట్ట. అతని నాలికే అతనికున్న ఆస్తట. కుక్షిలో నిలుపుకున్న ఆ నాల్గుముక్కలే అతని పెట్టుబడిట. ఆ రెండే అతనిచేత చెక్కా ముక్కా కొనిపించి ఉన్న పూరి యింటిని పెంకుటింటిగా మార్పించాయట.

నిత్యం వస్తున్న పప్పూ బియ్యాలతో కాలక్షేపం చేస్తూ కలిసి వచ్చిన కాలంలో కానీ పరకా కూడ పెట్టాడు.

రైతులు ఏటా పండించిన ధాన్యలక్ష్మిని ధనలక్ష్మిగా మారుస్తూ వచ్చాడు. ఆ ధనలక్ష్మే నాలుగేళ్ల క్రితం స్వర్ణ లక్ష్మి రూపంలో అవతారమెత్తి గృహలక్ష్మి మెడలో వెడల్పుగా గొలుసై వెలిసింది. అవధానికి ముగ్గురాడ పిల్లలూ ఒక్క మగపిల్లడూ.

మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగిపోతున్న అవధానిగారి యింట్లో అబ్బాయిని సాక్షాత్తూ ఆ అలివేలు మంగ మొగుడే ఆవేశించాట్ట.

ఆ వేళ ఆదివారం. ఆ యింటిల్లిపాదీ వాడికి హారతిపట్టి బొట్టుపెట్టి నమస్కరించి తాము చేసిన పొరపాటేమిటో చెప్పమని బ్రతిమాలేరు.

కానీ దేనికీ ఆ వెంకన్న పలకలేదట.

తుదకు చేసేది లేక అవధాని గారు కూడా వెళ్లి అపరాధ నమస్కారాలు చెప్పుకున్నా ససేమిరా పొమ్మన్నాడు.

ఇరుగూ పొరుగూ మూగారు. అంతా వింతగా చెప్పుకున్నారు.ఆ దేముడు మహిమే అన్నారు. పిలవలకు పలవలు మొలిచి ఊరంతా అల్లుకొంది.

సోమవారం నాటికి అవధానిగారి కొచ్చిన ఆపద ఆ నోటా ఈనోటా అంతా విన్నారు. ఎక్కడ విన్నా యిదే చర్చ.

పలకరింపుల కొచ్చిన జనాన్ని అవధాని గారి యిల్లు యిముడ్చుకోలేక కొందర్నవతలకూ— కొందర్ని వతలకూ నెట్టింది—

అలా ఇక్కడా అక్కడా నిలిచిపోయిన జనాన్ని చూసి— "ఏం చూసారు బాబూ, ఏవని చెప్ప మంటారు నన్ను! ఆ దేవుడి మహిమే కాపోతే వాడికి నిండా పట్టుమని పదేళ్లు లేవు. వేలెడంతున్నాడు., వెర్రివాడు. అలాంటివాడి మీదనా వాలడం. వాలితే వాడేమౌతాడు చెప్పండి?.

మాఖర్మ కాప్పోతే మా యింటే వాలాలా?

ఇంతమందున్నారు. యీ ఊళ్లో ఆ వెంకన్నకి వీడే దొరికాడా? చెప్పండి నన్నల్లరిపాలు చెయ్యడానిగ్గానీ—

వీడ్ని... తీసుకొని తిరపతి రమ్మంటాడు నన్ను నేనిప్పుడు వెళ్లగల్నా...? తంతే చేత కాణీ లేదు.

కాలంగాని కాలవాయె. వాడ్ని వెంటేసుకొని నేనెలా వెళ్లగల్నా తిరపతీ...

నే... వెళ్లలేను బాబూ... నే వెళ్లలేనా కొండమీదికి.

దేవుడోయ్! నావల్ల గాదు నాయనా... నీకో దండం... నీ కొండకో... దండం.

ఏంచ్చేటా చేసుకో... ఆ బిడ్డని చంపుతా నంటావో— ఉంచుతానంటావో నువ్వు పెంచుతా నంటావో— నీ యిష్టం. వాడు నా చెయ్యి దాటేడు. నీ చేతిలో ఉన్నాడు.

మాహాప్రభూ! ఏడుకొండల వాడా!, వెంకటేశా! అంతా నీ దయ.

నువ్వాడమంటే ఆడుతున్నాడు. నువ్వు పాడమంటే పాడుతున్నాడు.

నువ్ నవ్వమంటే నవ్వుతున్నాడు. అంతా నీ విలాసం. ఎలా జరిగితే అలా జరగనీ.

మా తప్పిదమేదో చెప్పమంటే చెప్పవ్? ఎంతసేపూ నా కొండ కొస్తావా...? రావా...? ఒస్తావా...? రావా...? నన్నిలా నిలదీసి చంపుతున్నావ్... కానీ... కానీ... ఎన్నాళ్లిలా ఏడిపిస్తావో" అంటూ అందరికీ వినిపించేటట్టంటున్నాడు అవధాని.

నిజానిజాలు తేల్చుకోలేని జనం నిలువు గుడ్లేసుకు చూస్తూ ఔననీ... కాదనీ రకరకాల వాదోపవాదాలు చేసుకొంటూ చర్చలు— పందాలు వేసుకొంటూ చూసి వచ్చారు జనం.

మంగళవారం నాడల్లా పువ్వులూ— పళ్లూ— దక్షిణలూ ఎవరు తీసుకువెళ్లినా వరద హస్తంతో వాటిని వశం చేసుకుంటూ అభయ హస్తంతో వారిని ఆశీర్వదించి పంపుతున్నాట్ట. ఆ రోజొక తీర్థం.

బుధవారంనాడు ఆ ఊరి నాయురాలే స్వయంగా తమ వీధి ఆడంగులందర్నీ వెంట బెట్టుకుని వచ్చి యిచ్చి



'వెలువడింది'
ఆంధ్రజ్యోతి పాఠకులను సీరియల్‌గా
వారం వారం ఉర్రూతలూగించి
ఉత్కంఠతతో చదివించిన
కొమ్మూరి వేణుగోపాలరావు
అద్భుత రచన
'నెత్తుటి బొట్టు' ..... 30.00
మీ సొంత లైబ్రరీకి
వన్నెతెచ్చే నవల!
డీలక్స్ పబ్లికేషన్స్
విజయవాడ -2
nani..



READY TO
WEAR TROUSERS
SHIRTS SAFARIS

GWALIOR SUITING
GWALIOR MILLS PRESTIGIOUS
SHOW ROOM IN A.P.
manhar A.C.
BESANT ROAD... VIJAYAWADA - 520002
BABU ADS

పువ్వులూ— పళ్లూ బాల వెంకటేశ్వరు సన్నిధిని ఉంచి భక్తితో పాదాలమీద పడి పది రూపాయిలు దక్షిణ యిచ్చి మరీ వెళ్లింది.

లక్ష్మివారం అవధానే నాయిరాలు యింటికి వెళ్లి స్వయంగా నాయురాల్ని వెంట తీసుకొచ్చి పిల్ల వెంకటేశు చేత తీర్థ ప్రసాదాలు యిప్పించి "పిన్నీ యివాళ లక్ష్మివారం చూసావా నేటి కైదురోజులైంది నేనెలా అల్లరి పాలయ్యానో... నా పాట్లేమిటో నువ్వే చూస్తున్నావు. నిజమూ తెలియదు. అబద్ధమూ తెలియదు. నా బాధ ఆ సర్వేశ్వరుడుకే తెలియాలి."

"ఏం చెప్పమంటావు నన్ను రాత్రిళ్లా నిద్దర్లు లేవు. పగళ్లా పస్తులు. వస్తావా...? రావా...? అంటే వాడికి నేనేం సమాధానం చెప్తాను పిన్నీ.... ఆ కాడికీ మూర్ఖాం కదా అని బెల్లం మెత్తిన రాయిలాగ ఊరుకున్నాను. ఉండనిస్తేనా?!

ఉండుండి... సరిగ్గా అర్ధరాత్రి. రావా?... ఎలా రావో చూస్తాను. అన్నాడు. పిన్నీ నువ్ నమ్మవ్ గాని వాడు కళ్లెర్ర జేసి అలాగంటుంటే — చెప్పకేం— నా కడుపున పుట్టిన బిడ్డల్లాగ కనపడలేదు పిన్నీ, నీకబద్ధం నాకు నిజం! వాడ్ని చూస్తే ఎందుకో భయం వేసింది. చూసాను— హమ్మనాయినా కధ యిహ మరి బాగు లేదనుకున్నాను.

మాటిమాటికీ వాడు నన్ను నిలవేసి దండించడ వేలా...?

కాదన్నానా అపచారం— ఔననడానికి చేతిలో పైసాలాడలేదు.

ఊ... సరే... కానీ యిహనేవైతే అదే అవుతుందని చెప్పి ఆయింతా నీ కొండ కొస్తామని వెంటనే మొక్కాను పిన్నీ

నీ దగ్గరకే వచ్చానముకో వచ్చి పిన్నీ— పిల్లల్ని తిరుపతి తీసుకెళుతున్నా నముకో— ఊహూ... అవి ఊరుకోవు కదా?

అంతా అలాగే — కో అంటే కోటిమంది. అంతా నా వాళ్లే. వాళ్లవల్లే పెరిగాను. వాళ్లవల్లే పెద్దయ్యాను. యింతవాడ్ని యింత వాణ్ని చేశారు. యిలా ఆలోచించి... ఆఖరుకు బయలుదేరడానికే నిశ్చయించు కున్నాను పిన్నీ— దశమీ స్థిరవారం బాగుంది.

ఏమంటావు పిన్నీ— నీ అభిప్రాయం చెప్పు. నువ్వేం చెప్తే అదే చేస్తాను. ఎవర్నడిగినా తలో ఆలోచనా చెప్తారు.

... పస్తాయిస్తున్నావేం పిన్నీ...? పెద్దదానివి. నీకు తెలియందేమిటి చెప్పు—బహుగా బతికినదానివి. ఎత్తి దించిన దానివి. గంపెడు సంసారం సాగిస్తున్నావు వెళ్లమంటావా...? మానమంటావా...? అంటూ నాయురాలు వంక చెల్లింపుగా చూసాడు అవధాని.

నాయురాలు ఏం అనడానికీ నోరురాక— "నేనేం అనగల్ను బాబూ దేవుడి దర్శనం చేసుకుంటానంటే వద్దనగలనా? చేసుకోమనే అంటాను. అనాలి" అంది అంతకన్నా జాగ్రత్తగా.

"అయితే రేపు ముందుగా వాడ్ని నీ దగ్గరకే తీసుకువస్తాను" అన్నాడు అవధాని వ్యవధి ఇవ్వకుండా.

ఓడిపోయింది నాయురాలు. "అలాగే వెయ్యి బాబూ" అన్నాది నీరసంగా.

శుక్రవారం ఉదయాన్నే అవధాని యింటినుండి బాజాభజంత్రీలు వాటి వెనుక వెంకటేశ్వరుని పటం పట్టుకొని అవధాని కొడుకు, అవధాని బయలుదేరారు.

ముందుగా నాయురాలి చేతి జోగి పుచ్చుకొని ఆవూరూ ఆ చుట్టుపట్ల తిరిగి యిల్లు చేరి ప్రయాణ సన్నాహాలు సాగిస్తున్నారు అవధాని కుటుంబం, అంతా వెళ్లడానికే నిశ్చయించుకొని. దశమీ స్థిరవారం వర్జ్యం లేకుండా చూచి పెద్దకూతుర్ని ఎదురురమ్మని యింటెల్లిపాదీ తిరుపతి తర్లి వెళ్లారు.

అంతా సవ్యంగావే తననుకున్నట్టే హాయిగా తిరుపతి చేరుకున్నారు.

* * *

ఆ కలియుగ వైకుంఠవాసిని కన్నుల పండువుగా దర్శించి తిరిగి వస్తుండగా అవధాని భార్య అకస్మాత్తుగా త్రుళ్లిపడి విషసర్పం పైటలో దూరినట్టు పైట గట్టిగా దులుపుకుంది. గాభరాగా రవికలో చూసుకుంది కళ్ల నిండా నీళ్లతో ముఖం నిండా చెమటతో నెత్తి మొత్తు కుంటూ తన మెడలో గొలుసు పోయిందంటూ గోలచేస్తూ గట్టిగా....

"ఏవండీ నా గొలుసు పోయిందండీ— యిప్పటి వరకూ ఉండిందండీ దుక్కపోతులాంటి గొల్సండీ" అంటూ శోకాలు పెడుతూ...—

"దేవుడా నీ కొండ కొచ్చిన ఫలిత మాయిది. యిదే మన్యాయం.... బాబూ" అంటూ రకరకాలుగా రాగాలు తీసింది. వాళ్లూ — వీళ్లూ పోగయ్యారు అటూ యిటూ చూసారు. చిన్నదాచితకదా పది తులాల పసిడి జంత్రిపోతు కనిపించకపోవడానికి? ఆకాడికీ అనుమానం వదలక అవధాని భార్య మగవాళ్లు చూస్తు న్నారన్న సిగ్గయినా లేకుండా చీర కుచ్చిళ్లొసిలించి బాగా మరోమారు గట్టిగా విదిలించింది చేతి సంచీ— అందులో ఉన్న బట్టలూ ఒక్కొక్కటే బయటకు లాగి మరీ దులిపించింది. ఎక్కడా కనపడలేదు.

అవధానికి నోటమాటరాక— కొయ్యబారిపోయి నిల్చున్నాడు. కొంతసేపుపోయాక అది మరి యిహ దొరకదు పద మంటూ భార్యను అనరాని మాట లన్నాడు. దరిద్రురాలన్నాడు. దశలేనిదన్నాడు. తనకు దాపరించిన శనిగ్రహమన్నాడు. విన్నవాళ్లంతా జాలి పడ్డారు.

రైల్లో... "ఏవండీ మొక్కుబడి ఉండిపోయిందిగదా అనుకున్నాను. ఎన్నిసార్లడిగినా కాదన్నారు. ఖర్చులకే కదా వెనుకాడుతున్నారనుకున్నాను. యింత పనౌతుం దనుకో లేదండీ దేవుడా?..."

"నీ మొక్కుబడి తీరలేదని యీ ఎత్తు ఎత్తావు— కదా... నీ మప్పబడే... కాకపోతే ఆ వెధవకేం తెల్సు... ఇంక నోరు ముయ్యి. పద ముష్టిదానా. ఊళ్లో వింటే నవ్వుతారు. హుండీలో వేసామని అఘోరించు. లేకపోతే బ్రతుకు లేదు. గుంట వెధవకీ నీళ్ల పుట్టవ్" అన్నాడు అవధాని—

## గోటి బొమ్మలు



నూర్ జహాన్ జవ్వని

—కాళీపట్నపు కృష్ణారావు, మురపాక